ఇస్ ఝండే కే నీచే

శ్రీ కలువకొలను సదానంద

ముందుగానే మనవి చేసుకుంటున్నాను–దేశభక్తుల్ని నొప్పించాలన్న ఉద్దేశం నాకు లేదు. అందరూ దేశభక్తులే! వాళ్లు రెండు జాతులు. మట్టిని ప్రేమించేవాళ్లు కొందరు; మనుషుల్ని ప్రేమించేవాళ్లు మరికొందరు. మీరు రెండోరకం వాళ్లయితేనే ఈకథ చదవండి. మొదటిరకం వాళ్లయితే, నా మేలుకోసం మానెయ్యండి.

మహాప్రభో! నేను నిన్ను తిడితే, అది నేరమే! నిన్నుతిట్టను. ఏడుస్తాను. గుండె బాదుకుంటాను. ఇరవైఏళ్ల క్రిందట మా అమ్మ 'సంసారం' సినిమా చూసివచ్చి సరదాగా పాడిందొక పాట. 'ఏడువకు ఏడువకు నాచిట్టితండ్రీ, భావిభారత బాలవీరుడవు నీవు!' అప్పుడూ ఏడ్చాను. ఇరవైఏళ్ల తరవాత ఇప్పుడూ ఏడుస్తాను. నాగుండె మూలుగును పెదవులమీద పలికిస్తాను. అది నేరమని ఏ జడ్జీకూడా చెప్పదు. పుట్టగానే పసిపాప ఏడుస్తుందికదా? నువ్వు దాని నోరు మూయించగలవా? ఏడ్చే స్వాతంత్ర్యం మానవాధముడి జన్మహక్కయ్యా బాబూ! నేను ఏడుస్తాను. నీకు వేడుక చేస్తాను.

స్వీయకథ చెప్పుకునేవాడు ఊరూపేరూ చెప్పుకోవాలి కదా? మొదటే నాపేరు చెప్పాను. ఊరు—అశోకపురం అనేపేరు బాగుంది కాబట్టి, అదే అనుకోండి. కూలీలు, పంతుళ్లు, ఎన్‌జీవోలు మొదలైనవాళ్లు భారత జాతికి స్వెసిమన్లు. వాళ్లలో నేనొకణ్ణి.

మీరు రోజా వార్తాపత్రిక తిరగేసే అల వాటున్న వాళ్లయితే—అగస్టు పదిహేను తర్వాత రెండోరోజునో, మూడోరోజునో తప్పక ఈమాటలు చదువుతారు.

'అశోకపురం ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర్యదినోత్సవం జరిగింది: సభకు శ్రీ జి. రామ కృష్ణయ్య అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు సర్వశ్రీ కాదర్‌ఖాన్, దానియేలు, నాగరత్నపిళ్లె ప్రభృతులు ప్రసంగిస్తూ ప్రాణాధికమైన స్వాతం త్ర్యాన్ని పరిరక్షించుకోవాలని నొక్కి వక్కాణించారు. ప్రధానోపాధ్యాయులు వందన సమర్పణచేశారు. పిల్ల లకు మిఠాయిలు పంచిపెట్టబడినవి. పురవీధులలో గొప్ప ఊరేగింపు జరిగింది.'

ఇందులో చివరిమాటను మళ్లీ వోమారు చదువుకోండి. మీరు ఉలికిపడకపోతే పోవచ్చు. నాసంగతివేరు. నేనొక జపాన్. నాగుండె హిరోషిమా. ఆమాట ఒక ఆటంబాంబు!

పత్రికలవాళ్లు చాల దయగలవాళ్లు. అందుకే ఆ నాలుగైదు మాటలైనా అచ్చువేస్తారు. ఊరే గింపు జరిగింది—అంటూ ముగిస్తారు. ఆ ఊరేగింపు ఎలా జరిగింది, ఎలా ముగిసింది - చెప్పాలంటే అదొక కథ అవుతుంది. క్రిక్కిరిసిపోయిన మహా పట్నంలాంటి ఆ వార్తాపత్రికలో అంతచోటు ఎక్క డుంటుంది? అందుకే ఆమాటను యిక్కడ సాగ దీస్తున్నాను.

వెనకటి రోజుల్లో—లేకలేక కొడుకునుగన్న మహారాజుగారు 'ప్రజలంతా పండుగచేసుకో వాలహో!' అంటూ రాజ్యమంతా చాటించేవారని మనం కథల్లో వింటుంటాం. పండుగచేసుకోలేని పుట్టుదరిద్రుల్నికూడా ఈ వసుంధర భరిస్తున్నదని ఆ మహారాజుగారు ఆలోచించేవారు కాదేమో! లేకుంటే ఆయనగారి ఏలుబడిలో అందరూ చల్లగా వుండే వారేమో!

ఇప్పుడు మనకు రాజులులేరు. అయితే రాజుల్లాంటి వాళ్లు, రాజప్రతినిధుల్లాంటి వాళ్లు, వాళ్లు ప్రకటించే చాటింపులూ లేకపోలేదు. రాజధానినుండి జిల్లా అధికారులకు, వాళ్లనుండి మన పై అధికారులకూ అవి అంచెలవారీగా వస్తాయి. ఘనత వహించిన మా ఆఫీసరుగారి వద్దనుండి అలాంటి చాటింపు ఒకటి రానేవచ్చింది. 'ఇందు మూలమున యావన్మందికీ తెలియజేయడ మేమనగా—ప్రతి పాఠశాలలోను స్వాతంత్ర్యదినోత్సవము జరుపుకోవలెను. ఉదయం ఠంచనుగా ఏడున్నర గంటలకు జెండా ఎగుర వేయవలెను. గ్రామములోని ప్రముఖులను రావించి ఉపన్యాసము లిప్పించవలెను. నినాదములతో పురవీధులలో ఊరేగింపు జరుపవలెను. ఈవిధముగా జరిపిన తదనంతరము మాకొక సమగ్రమైన నివేదిక తయారుచేసి పంపవలెను. ఇది అతి జరూరు'

పెద్దలమాట పరిహసింప దగింది కాదు సుమా! స్వాతంత్ర్య దినోత్సవంకంటే అతి జరూరైన విషయం దేశానికి మరేముంది? తను ప్రాణాల్ని సైతం తృణప్రాయంగా అర్పించి, మన పూర్వులు మనకు స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టింది ఎందుకయ్యా? ఏడాదికొకసారి ఘనంగా పండుగ జరుపుకోడానికే గదా?.. ఊరేగండోయ్ ఊరేగండోయ్, ఉపాధ్యాయులారా! బోలో స్వతంత్రభారత్‌కి జై. బోలో నోరారా!

ఊరేగింపు ఒక్కటి మాత్రం నాకు యిష్టం లేదు. ఈమాట అన్నందుకు నన్ను అపార్థం చేసుకోకండి! రచయిత మనసువిప్పి మాట్లాడుకోవాలంటే — పాఠకుల కంటే ఆత్మబంధువులు ఆ దిక్కుమాలినవాడికి మరెవరున్నారు? అస్థిరమైన ఈ జీవితంలో నాకు అత్యంత ప్రియమైనది ఒకటుంది. అది—ఆగస్టు పదిహేను! అంతే ప్రియమైన నా జీవితంలో నాకు బొత్తిగా ఇష్టంలేనిది ఒకటుంది. అది—ఊరేగింపు!

అయితే, కేవలం నా ఒక్కడి ఇష్టానిష్టాలతో మా హెడ్మాస్టరుగారి కేంపని? ఆయనకు అత్యంత ప్రియమైనది విధేయత! మనం ఉత్తరమో, విజ్ఞాపనమో వ్రాసేటప్పుడు చివర 'ఇట్లు తమ విధేయుడు' అని వ్రాస్తాం. మా హెడ్మాస్టరుగారు కూడా ఆమాటే వ్రాస్తారు. అయితే మనం లాంఛనంగా వ్రాస్తాం; ఆయన కలాన్ని గుండెలోముంచి మరీ వ్రాస్తాడు. విధేయత అంటే అలా వుండాలి! పై అధికారులు అప్పజెప్పిన పనిని ఆయన కలలో గూడా కాదనలేదు. ఆయన కలలు నాకెలా తెలుసనంటారా? ఎందుకు తెలియదు? పైవాళ్లిచ్చిన రాఫిల్ టిక్కెట్ల పుస్తకాల్ని అయన ఎప్పుడూ నిరాకరించలేదు. అంతెందుకూ, ఆయన ఎప్పుడూ ఒక్కపూట కూడా సెలవు పెట్టలేదు. అలాంటి వాడు ఊరేగింపు వద్దు మొర్రో అంటే వింటాడా? రామ రామ! దొరవారు ఖరారుచేసిన కార్యక్రమాన్ని తు. చ. తప్పకుండా జరిపించి, ఊళ్లోని సందుగొందులైనా విడిచిపెట్టకుండా ఊరేగింపు జరిపించి, కాపాడగల ప్రభువులకు రిపోర్టు వ్రాసిపంపడూ? ఒక్క ప్రభువులకే ఏమిటీ, ప్రజలకందరికీ తెలియాలి గనుక 'గొప్ప ఊరేగింపు జరిగె' నంటూ న్యూస్ రిపోర్టుకూడా వ్రాసిపంపడూ?

ఊపిరాడని ఇరుకు వీధిలోనుండి ఆరోజు ఉదయం మువ్వన్నెజెండా నింగికెగిరి 'హాయ్' మంటూ స్వేచ్ఛగా గాలి పీల్చుకొంది. ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు పిల్లల్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఉపాధ్యాయులెప్పుడూ వుత్త ఆదర్శాలే వల్లిస్తారు! బ్రతకటానికి అవి పనికిరావు. మా చిదానందం కూడా నాలుగుమాటలు మాట్లాడాడు. పిల్లల యెదుట మేజావద్ద నిలబడి మాట్లాడుతున్న చిదానందం ఎలావున్నాడో చూడండి. ఇస్త్రీ చేయని చొక్కా—ఇంకా పూర్తిగా ఆరని ఉతికినచొక్కా—చందమామలో మచ్చల్లా అక్కడక్కడా చిరుగులున్న చొక్కా తొడుక్కున్నాడు. నీళ్లుపెట్టి చక్కగా దువ్వుకొచ్చిన క్రాపులో తడి అప్పుడే ఆరిపోయి, తల బూరుగుపత్తిలా తయారైంది. అవ్వగారు చప్పరించి పారేసిన నారమామిడి టెంకలా వుంది అతని మాసినగడ్డం. చిదానందం ఆ శుభోదయాన

కనీసం ఉప్పువేసుకున్న చద్దన్నం తినిగానీ, కాఫీపొడి చాలీచాలని వేడినీళ్లు త్రాగిగానీ రాలేదన్నమాట హరిశ్చంద్రుడి ఆదర్శమంత సత్యం! లేకపోతే అతను మాట్లాడుతున్నంతసేపూ రెండుచేతులూ మేజామీదమోపి, అలా వంగినుంచోడు. అతనికంటిలో కాంతిలేదు. గొంతులో జీవంలేదు. ముఖంలో చేవలేదు. అతను చిదానందం. ఆనందాన్నిచ్చే ఏ భౌతిక పదార్థమూ అతనికి అందుబాటులో లేదు. అతని ఆనందమంతా—కంటికి కనిపించని 'చిత్తు' అనబడే పదార్థంలోనే వుంది.

అతన్ని పిడికిట్లోపెట్టి పిండినా, మనం మందుకైనా చూడలేని కాంతి, జీవం, చేవ— అతని పలుకుల్లో మాత్రం నిండు గోదావరిలా వున్నాయి.

చిదానందం అన్నాడు: 'మనమంతా స్వతంత్ర భారత పౌరులం. స్వాతంత్ర్యం స్వర్గంకంటే గొప్పది. ఆ స్వాతంత్ర్యంకోసమే మనం జీవించాలి. ఆ స్వాతంత్ర్యంకోసమే మనం సంతోషంగా చావాలి!'

చిదానందం! గొప్పమాటే అన్నావు. అయితే ముప్పాటలా ముక్కుడకా మెక్కి, తేరెక్కి పూరేగే వాడు గంభీరంగా అనవలసినమాట నువ్వంటున్నావేమిటీ? నీ కింకేమీవద్దా? నువ్వు కోరకపోయినా, నీ కోసం నీ పెళ్లాం కోరుకునే కొత్తచొక్కా నీకు వద్దా? గడ్డం గీచుకోవటానికి పావలాకాసు వద్దా? కడుపులో పేగులు ముడుచుకుపోకుండా వుండేందుకు చద్దన్నం వద్దా? 'ఆహా, స్వాతంత్ర్యం' అంటూ ఆకాశమంత పెద్ద పంజరంలో కూర్చుంటావా? నేను నీయంతటి మహాశయుణ్ణి కానుబాబూ! నాకు ప్రాణం కావాలి. శ్వాసలాంటి స్వాతంత్ర్యం కావాలి! స్వాతంత్ర్యంతో బాటు సుఖశాంతులు కావాలి! ఈ మూడూ నా జన్మహక్కులు. కాదనే వాడెవడైనా వుంటే—వాడు పూర్వజన్మలో బానిసల వ్యాపారి!

త్రివర్ణపతాకాన్ని గురించి నేను ఒకటిరెండు నిమిషాలు మాట్లాడాను.

ఈ పతాకం నాకు క్రొత్తకాదు. దీనితో నాకు దాదాపు పాతికేళ్ల పరిచయంవుంది. నా చిన్నతనంలో—మా అన్నయ్యకు ఓ నేస్తం వుండేవాడు. విఠల్ అనే రైల్వేగార్డు. అతన్ని చూచినప్పుడల్లా నాకు మూడురంగుల జెండా గుర్తుకు వస్తుంది. ఈ జెండాను చూచిన ప్రతిసారీ, ఇందులో విఠల్ ముఖం నాకు కనిపిస్తుంది.

పిల్లలూ! నేను మీ యంత చిన్నవాడుగా వుండేరోజుల్లో ఓనాటి ఉదయం మామూలుగానే బడికి వెళ్లాను. బడిఅంతా చాలా సందడిగా వుంది. ఏమంటే — మనకు స్వరాజ్యం వచ్చిందన్నారు మా పంతుళ్లు. స్వరాజ్యం అంటే మాకు అర్థం కాకపోయినా, మేమందరం ఎంతో సంతోషించాం. అంత సంతోషాన్ని ఈనాటిదాకా మళ్లీ అనుభవించలేదనుకోండి. మా పంతుళ్లు మాకు చిన్న చిన్న కాగితపు జెండాలు, వాటిని గుచ్చి పెట్టుకోడానికి గుండుసూదులూ యిచ్చారు. ఆ జెండాలో మూడు రంగులున్నాయి. మధ్యలో తెలుపు, ఒక అంచున ఎరుపు, రెండోఅంచున ఆకుపచ్చ. ఎరుపు, ఆకుపచ్చ రంగుల నడుమ తేడా నాకు ఆ పసితనంలో తెలియలేదు. ఆరెండు రంగులూ నాకంటికి అందంగానే కనిపించాయి. ఆకుపచ్చరంగు—పైన, ఎర్రరంగు—క్రిందా వుండేటట్లుగా నా కాగితం ముక్కను ఎదురు రొమ్మున చొక్కాకు గుచ్చుకుని మురిసిపోతూ బడిముందర నిలబడ్డాను. అప్పుడు దారిన పోతున్న విఠల్ నా దగ్గరికి వచ్చి 'అలా కాదురా బుల్లిగాంధీ, ఇలా!' అంటూ నా జెండాను తిరగేసి గుచ్చాడు. ఆయన రైల్వేగార్డు కదా? ఎర్ర జెండా, పచ్చజెండా అతనివే కదా? ఆ రెండురంగుల తేడా నాకంటే ఆయనకే బాగా తెలుసుమరి!

ఆరోజున మేము—నేటి పౌరులం, అంటే నిన్నటి బాలలం—మహోత్సాహంతో, ఎక్కడెక్కడ ఇళ్లున్నాయో అక్కడికల్లా ఊరేగింపు వెళ్లాం జేజేలు పలికాం. కేరింతలు పెట్టాం. చప్పట్లు కొట్టాం. గాంధీజీకి జై అన్నాం. జిన్నా జిందాబాద్

అన్నాం. అలుపూ సొలుపూ లేకుండా నడిచాం. ఎందుకు, ఎందాక అన్న వూసేలేకుండా నడిచాం. రెండు పుష్కరాలు నడిచాము. ఇలా నడుస్తూ వుండగానే మా గులాబీరేకుల పాదాల్లోని మార్దవ మంతా మాసిపోయింది. ఇప్పుడీకాళ్లు ఎలాకాయలు గాచిపోయాయో చూడండి. ఇక మావల్లకాదు. మేము నడువలేము. 'ఎంతెంతదూరం, ఇంకెంత దూరం?' అనుకుంటూ నడవటానికి మాలో ఓపిక చెప్పుల్లా అరిగిపోయింది మా తరం గడిచిపోయింది, ఈతరం మీది! నడవడం యిక మీవంతు. ఊరేగండి. వీధు లన్నీ తిరగండి. ఎవరికి, ఎందుకు, ఏం లాభం అని ఆలోచించకుండా జేజేలు పలకండి. ఈ లేత ప్రాయంలో మీరు నిజమైన స్వతంత్రులు. పెద్ద వాళ్లయ్యాక మీకు ఆ స్వాతంత్ర్యం వుండదు వీధుల్లో నిబ్బరంగా తలెత్తుకుని తిరిగే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మీలాంటి చిన్నవాళ్లకేగానీ, నాలాంటి పెద్దవాళ్లకు లేవు.

ఊరేగింపు మొదలైంది.

ప్రాణము, మానము, ధనము—ఈ మూడూ మనిషి వదులుకోడానికి యిష్టపడనట్టివి. ప్రాణం వున్నా, నేను జీవచ్ఛవాన్ని. ధనం అందామా—నున్నలన్నీ నావే! ఇక మిగిలింది మానం! దాన్ని పోగొట్టుకోవడం నాకు సుతరామూ ఇష్టంలేదు. మరోమాటలో చెప్పాలంటే—వీధుల్లో నడవడం నా కిష్టంలేదు.

అయినా నడవక తప్పదాయె! ఇది స్వాతంత్ర్య దినం!

పశువుల పండుగ అంటే ఏమిటో మీకు తెలుసనుకుంటాను. ఆరోజు పశువులకు ప్రభలు కడతారు. వీధుల్లో వాటిని తరుముతారు. అవి మొండికేస్తే వెంటబడి డప్పులు వాయిస్తారు. పాపం, బ్రతికినంతకాలం రెక్కలు ముక్కలు జేసు కుంటూ, బ్రతుకుతున్న నేరానికి నానాగడ్డి తింటూ విధిరాకాసి తమ మెడలమీద బిగించికట్టిన కాడికి అంకితమైపోయిన నిర్భాగ్యప్రాణులవి — నోరులేని జీవాలవి— ఆ వేడుకపూట వీధికి యిరువైపులా క్రిక్కిరిసిపోయిన జనసమూహాన్ని చూసి బెదిరిపోయి, అడుగు కదలక బొమ్మలై నిలబడిపోతే, వెనక డప్పులు హడలగొట్టేస్తూవుంటే ఎటు వెళ్లడానికీ దిక్కులుతోచక, అడ్డదిడ్డంగా చిందులు వేస్తాయి. నాటి పేరుమీదుగా జరిగేపండుగ అది.

ఇది స్వాతంత్ర్య దినం!

వీధుల్లో వెళ్లటానికి భయమెందుకు? మనుషులు నడవటానికే గదా—అశోకవర్ధన చక్ర వర్తిని మరపించే ఇంచక్కని బాటలు వేయించారు మనవాళ్లు?...అడగవలసిన మాటే!

అయితే నేను చెబుతున్నది మాన్యుల్నిగురించి కాదు! సామాన్యుల్ని గురించి. వీధిలో గండుపిల్లి మీసాలు నాక్కుంటూ నిలబడివుంటే, చిట్టెలుక ఎలా నడుస్తుంది? చారల బెబ్బులి కోరలు బయటపెట్టి పచార్లుచేస్తూవుంటే మేకపిల్ల ఎలా నడుస్తుంది? బ్రహ్మరాక్షసి నింగికి నిచ్చెన వేసి నట్లు నిలబడి 'నరవాసన, నరవాసన' అని పెడ బొబ్బలు పెడుతూంటే, దాని కాళ్లసందులోంచి ఏ బ్రాహ్మడు నడిచిపోగలడు?

చిన్నప్పుడు ఒకరకమైన బొమ్మల పజిల్స్‌తో కాలక్షేపం చేయడమంటే నాకు చెవికోసుకునేటంత సరదా. ఇదిగో, ఇక్కడ ఎలుకవుంది. అక్కడ కలుగు వుంది. కలుగు చేరుకోవడానికి ఎన్నో దారులున్నాయి. వుడుగడుగునా ఎన్నోపిల్లులు ఎలుకను పట్టుకుందా మని పొంచి చూస్తున్నాయి. పిల్లినోట్లో పడకుండా ఎలుక కలుగులోకి వెళ్లిపోవాలి. నువ్వు దానికి దారి చూపించగలవా?

అల్లరి మేకపిల్ల అడవిలో తప్పిపోయింది. అడవి చివర మేకలకాపరి వున్నాడు. అడవినిండా పులులూ, తోడేళ్లూ వున్నాయి. మేకపిల్ల ప్రాణా లతో బయటపడేమార్గం ఏదో కనుక్కో!

ఇలాంటి పజిల్స్‌లో — నిరపాయకరమైన చుట్టుదారి ఒకటే వుంటుంది. ఆ దారిని నేను

యిట్టే కనిపెట్టేసి, ఆపదలోంచి బయటపడ్డ ఎలుకలా, మేకపిల్లలా సంబరపడి పోయేవాణ్ణి. పెద్దయ్యాక ఈ ఆట నాకు నిత్యజీవితావసరమై పోయింది. ఇప్పుడీ బొమ్మగీయండి. ఓ పాతిక వీధులు. ఈ చివర—పెంకులు రాలిపోతున్న నా అద్దెకొంప లోంచి నేను తొంగిచూస్తున్నాను. నా తల మేక తలకాయలాగా వుండాలి! ఆ చివర దూరంగా నేను పని చేసే బడి. (బడి ఎలావుండాలి? మీ వూళ్లో బడిని చూసి గీయండి!) వీధుల్లో, వీధి మలుపుల్లో పులులు, తోడేళ్లు, కత్తులు పూనిన కసాయి వాళ్లు, పాత రాతియుగపు బ్రహ్మరాక్షసులు! బాబోయ్, గంట ఎనిమిదైపోయింది. నేను బడికెలా వెళ్లాలి?

వెతికే వాడికి ఏదోఒక దారి కనిపించకపోదు. నే నెప్పుడూ ఆ ఒక్క దారిలోనే నడుస్తాను. వీధు లన్నీ తిరగడం ఎప్పుడో మానేశాను.

ప్రభుత్వకార్యాలయాలపైన, ప్రైవేటు భవనాలపైన జాతీయపతాకా లెగురుతున్నాయి. రంగు కాగితాల తోరణాలు రెపరెప లాడుతున్నాయి. పిల్లలు బారులుబారులుగా వీధిలో నడుస్తున్నారు. వాళ్ల చేత మా చిదానందం బిగ్గరగా జేజేలు పలి కిస్తున్నాడు. పోలేరమ్మజాతరలో నడిపింపబడే పొట్టే లులా నడుస్తున్నాను నేను. పదుపుకత్తె పటాటోపం కోసం ముఖంనిండా పౌడరు పులుముకున్నట్లు—కృత్రిమమైన మందహాసాన్ని నా ముఖంనిండా పులుముకున్నాను. ఏదో ముఖ్యమైన కర్తవ్యం నా ఒక్కడి నెత్తిన వున్నట్లు, ఇప్పుడు నేనాకర్తవ్య పాలనలో మునిగిపోయి వున్నట్లు—ప్రక్కలకైనా చూడకుండా నడుస్తున్నాను. శత్రువులు కంటబడితే ఉష్ట్రపక్షి ఇసుకలో తల దూరుస్తుందట! వట్టి దద్దనమ్మ అది! నేను వీలైనంతవరకు మౌనంగానే నడుస్తున్నాను. తప్పనిసరియై సహోపాధ్యాయులతో మాట్లాడవలసివస్తే, కందమూలాలతో పొట్టపోసు కుంటున్న పరమసాత్వికునిలా మెల్లగా మాట్లాడు తున్నాను. దొంగను తేలుకుడితే, వాడు మౌనంగా వుండక నోరు బాదుకుంటాడా?

ఊరేగింపు ముందుకు సాగిపోతూవుంటే—నృత్యాలపోటీలో వినిపించే మృదంగంలా నా గుండె మ్రోగసాగింది. బకాసురుడికి ఆహారంగా బండెక్కి కూర్చున్న పిరికివాడి మరణవేదన ఎలాంటిదో నాకు బోధపడసాగింది.

అదిగో, ఆ మలుపు తిరిగితే పెద్దబజారు!

ఆ బజారులో ఎన్నోవస్తువులు అమ్ముడు పోతాయి. ఉప్పు నుంచి విస్కీదాకా అన్నిటికీ వెల లున్నాయి. ఆ వస్తువులకు ప్రాణంలేదు. నాకు ప్రాణం వుంది. అయితే నా పరువుప్రతిష్ఠలకు పెద్ద బజారులో పైసా విలువకూడా లేదు. నా పాలిటి తోడేళ్లు అక్కడున్నాయి!

పురాణదేవతలపట్ల నాకు అసూయవేసింది. అనుకున్నంతలో అదృశ్యమైపోయే విద్య వాళ్లకు తెలుసు. ఆ విద్య నాకుంటే—నిబ్బరంగా ఎన్ని వీధు లైనా తిరగవచ్చు. ఆ విద్య నాకు తెలియదు. నా విద్యలు వేరే వున్నాయి.వాటిని శరణు వేడెదగాక!

ఒక చదరం గీయండి. నాలుగు మూలలకూ ఎ, బి, సి, డి అని పేర్లు పెట్టండి. ఊరేగింపు నాలుగు భుజాలనూ చుట్టిరావాలన్నమాట! ఇప్పుడు నేను ఎ బి అనే గీతమీద మూడువంతులదూరం నడిచాను. బి సి—అనేది పెద్దబజారు. ఇక కొద్ది క్షణాల్లో ఊరేగింపు బి వద్ద మలుపు తిరుగుతుంది. అటుతరవాత సి వద్ద మలుపుతిరిగి డి వైపుగా కదిలి వస్తుంది. ఎబి ని, సిడి ని ఖండిస్తూ పెద్దబజా రుకు సమాంతరంగా ఒక గీత గీయండి. అది ఒక సన్నటిసందు. ఊరేగింపులోనుండి ఊడిపడి, నేను ఆ సందుదారి పట్టాను. కాలాన్ని, దూరాన్ని సరి తూచుకుంటూ నడిచి, సందు రెండోచివర మళ్లీ ఊరేగింపుతో కలుసుకున్నాను.

పెద్దగండం తప్పింది! చిన్నప్పుడు జలగండం, అగ్నిగండం, వాహనగండం వగైరాలు తప్పిపోయాయి. అలాంటివాటిలో ఇదొకటి. సురక్షితంగా మళ్లీ బడి చేరుకున్నాను. పిల్లలందరూ కొండకొమ్మున కురిసిన వానలా చెల్లాచెదరుగా వెళ్లిపోతున్నారు.

చిదానందం నాదగ్గరకు వచ్చాడు పిప్పర మెంటొకటి నాచేత బెట్టాడు. నోట్లో వేసు కున్నాను. తియ్యగావుంది. రెండో క్షణంలోనే ఈ మాటన్నాడు–'పెద్దబజార్లోంచి ఎచ్చేటప్పుడు నువ్వు కనిపించలేదేం?......నందగోపాలుడు నిన్ను గురించి అడిగాడు.' నా నోట్లోని పిప్పరమెంటు తృటిలో చేదై పోయింది.

నందగోపాలుడంటే — యశోదమ్మ ముద్దుల కొడుకనుకునేరు?ఆ నందగోపాలుడు గోపికల బట్టలు లాక్కుని, వాళ్ల పరువుతీశాడు. ఈ నందగోపాలుడు బట్టలిచ్చి పరువుతీస్తాడు.

అతను సర్వోపగతుడు! ఇందుగలడందులేడని సందేహమే వలదు. అతను మా వూళ్లో వున్నట్లే మీ వూళ్లోనూ వున్నాడు.

అదిగో,— 'కలయో, వైష్ణవమాయయో, యితర సంకల్పార్థమో, సత్యమో' అన్నట్లు మాట లోనే వచ్చాడు నందగోపాలుడు! సైకిలు దిగాడు. ఎదుట నిలబడ్డాడు. ఆ చూపుల్ని సహించడం ఎవరి తరం? పురుగును చూసినట్టు చూశాడు. ఈ భరతఖండంలో ఎన్ని పురుగులు బ్రతకటం లేదు! అవి బట్టలు కట్టుకోవు. అయినా వాటిమానం పోదు.

నందగోపాలుడు మంచివాడే! మర్యాదగా మాట్లాడుతాడు. చేతితో తాకకుండానే నా తల వంచేస్తాడు.

'ఇదేం బాగా లేదు సార్!'

నందగోపాలూ! నీకు నచ్చజెప్పడం ఎలా? ఇస్తాను. నీ సొమ్ము ఎక్కడికీ పోదు. నేను చాలా మంచివాణ్ణి! ఒకరి ఋణం పెట్టుకోకూడదని ఎప్పుడూ అనుకుంటుంటాను. అదిపోనీ, ఎలావుంది నీ వ్యాపారం? బాగానే వుందా? ఏమిటో పాపం, అడ్డమైన వాళ్లకందరికీ అప్పులిచ్చి, వాళ్లవెంట తిరగడంతోనే సరిపోతూ వుంది నీ పని! అన్నట్టు— నీ కొడుకు ఎన్నో క్లాసు? మూడో క్లాసా? మూడో క్లాసు పంతులు చిదానందం! బాగానే చెబు తాడులే! అతనుకూడా నీకు డబ్బివ్వాలనుకుంటానూ? అరియర్సు రాగానే యిచ్చేస్తాడులే!...

నందగోపాలుడి ముందర నేను మాట్లాడ లేకపోతాను. మాట్లాడే ఒకటి రెండు మాటలైనా నంగినంగిగానే ఏడుస్తాయి. అతను వాఠి!

'ఆరునెలలైపోతున్నాయి. మీరేమో కంటి కైనా కనిపించరు. ఏమనుకోవాలి మేము?...' అంటూ ముఖం మాడ్చుకున్నాడు నందగోపాలుడు.

నేను చాలా ఆత్మీయంగా అతనిచేయి పట్టు కుని 'ఔనౌను, ఆరు నెలలై పోయాయి. ఈ నెల జీతం రాగానే పూర్తిగా యిస్తాను నందగోపాలూ!' అంటూ చిరునవ్వు నవ్వాను. వ్యభిచరిస్తూ పట్టుబడి పోయిన వేశ్య పోలీసువాణ్ణిచూసి అలా నవ్వుతుందేమో!

'మీ యిష్టం సార్! ఈ నెల చూస్తాము. ఆ తరవాత మమ్మల్ని నిందించి లాభం లేదు. చెప్ప లేదనుకునేరు?' అంటూ సైకిలెక్కి వెళ్లిపోయాడు నందగోపాలుడు.

నందగోపాలూ! మనమిద్దరం ఒకే గడ్డమీద పుట్టాం. ఒకే ఊటనీరు త్రాగి పెరిగాం. ఒకే గాలి పీల్చి బ్రతుకుతున్నాం. అయినా—నీకూ నాకూ ఎంత వ్యత్యాసం! నిన్ను చూస్తే నా తల వంగిపోతుంది. నన్ను చూస్తే నీ తల పైకి లేస్తుంది. నాకులేని ఆ స్వాతంత్ర్యం నీ కెక్కడిది? అది ఎందులో వుంది?

ఉన్నట్లుండి—కంగారు పడిపోతున్నట్లుగా కేకలు వినిపించాయి. గుడ్లు పెడుతున్న కోడిని గుంతనక్క ఎత్తుకుపోతుంటే, కోళ్లుగల మారాజు అలా కేకలేస్తాడేమో! ఆ గొంతు లక్ష్మీపతిది! బడి ఎదుటివైపున చిరుతిళ్లు అమ్మే ఆసామీ పేరే లక్ష్మీ పతి. అతని ప్రియమైన పది రూపాయల కాగితం ఒకటి ఎందుకు అలిగిందో-పువ్వులమీద వాలే సీతా కోక చిలుకలా ఎగురుతూ రోడ్డుదారి పట్టింది. పుట్టింటికి వెళ్లిపోతున్న ముద్దుల పెళ్లాం వెంట బడ్డట్టుగా—లక్ష్మీపతి కొట్టుదిగివచ్చి, ఫుట్‌బాల్

ఆటగాడిలా ఆ కాగితంవెంట కొంతసేపు కదం త్రొక్కి, చిట్టచివరికి దాన్ని చేతికి దొరకబుచ్చుకున్నాడు.

అతని ముఖంలో చిరునవ్వు!

ఆ నవ్వుకు ప్రాణం పోసినది ఏది?

అదే! డబ్బు!

అర్థంలోనే అన్నీ వున్నాయి.

నా ప్రాణానికీ దానికీ, నా మానానికీ దానికీ, నా శ్వాసకూ దానికీ, నా స్వేచ్ఛకూ దానికీ, నా సర్వస్వానికీ దానికీ ఏవో బ్రహ్మముడు లున్నాయి. కంటికి కనిపించని ముడులు అవి. ఆ అంగం ఆరోగ్యంగా వుంటేనే, తక్కిన అంగాలన్నీ బాగుంటాయి. ఆ అంగం దెబ్బతింటే, ఇదిగో-మనిషి వాలాగా తయారవుతాడు.

మనిషికి శారీరకంగా జబ్బుచేస్తే—రోగిని వేపాకుతో మంత్రించే వైద్యులింకా వున్నారు. ఆర్థికమైన జబ్బులు రాకుండా వుండటానికి ప్రభుత్వం వారి మంత్రాక్షరాలు యివిగో: 'పొదుపు చేయండి!' కొత్తమందులు కనిపెట్టి వాటిని ఎలుకలమీద, కోతులమీద ప్రయోగించే శాస్త్రవేత్తలకు మల్లే—ప్రజల సమస్యలకు పరిష్కారంగా కొన్ని నినాదాలను సృష్టించి చేతులు కడుక్కోవడంతో ఏలినవారి బాధ్యత తీరిపోయినట్లే!

'పొదుపు చేయండి' అనే మాట నా పట్ల ఒక వెక్కిరింత! నా అవసరాలకు చాలినంత సంపాదనే వుంటే, తిరణాలకు వెళ్లను. తాగి తందనాలాడను. అంతో యింతో పొదుపు చేస్తాను. అయితే—మిగిలితే కదా, పొదుపు చేయటం?

'నీ జీతమంతా ఏం చేస్తావు' అని నా ప్రియమైన పాఠకులు నన్ను అడగరు. ఆ మాట అడిగే వాళ్లు కొందరున్నారు. వాళ్లు కేవలం దేవు డనబడే భావాన్ని వివిధ రూపాల్లో ప్రతిష్ఠించి పూజించేవాళ్లు. వారికి దేవుడిపట్లవున్న విశ్వాసం—భౌతికజీవనంలోని కరుణామయమైన, దివ్యమైన సంఘర్షణపట్ల వుండదు. వడ్డీకాసులవాణ్ణి నమ్ముకుని బ్రతుకుతున్న మహాప్రభువులారా! మనిషి గుండెగోడలమాటున దివ్యజ్యోతిలా వెలిగే ఆర్ద్రతను, సానుభూతిని ఆ వేంకటేశ్వరుడైనా ఆరాధిస్తాడని మీకు తెలియదూ?

'ఇద్దరు, లేక ముగ్గురు చాలన్నారు. సరే అన్నాను. వారానికి ఒకపూట ఉపవాసం చెయ్యమన్నారు - అప్పటికి నేనేదో నిత్యకల్యాణం పచ్చతోరణంగా మహాతినిబలిసిపోతున్నట్లు! ఆ మాటనుకూడా గీతోపదేశంగానే భావించాను. నీచత్వానికి పరాకాష్ఠను 'ఆడంబర'మని తిట్టిపోసి, దానిపట్ల అంటరానితనాన్ని పాటించాను. సాంఘికావసరాలలో ప్రముఖపాత్ర వహించే రేడియో, గడియారంలాంటి వస్తువుల్నిగూర్చి కలలుగనటం తప్పితే, అవి లేనందుకు ఏనాడూ చింతించి ఎరుగను. మరి ఎందుకు బ్రతకలేకపోతున్నాను?

ఎక్కడినుంచో ఎక్కడికో వేగంగా కదిలివెళ్లిపోతున్న ఈ అణువంత చిన్నగోళంలో—సువిశాలమైన భారతదేశం నాది! ఇప్పుడిక్కడున్న ఈ గ్రహం గంటక్రితం యిక్కడలేదు. వెయ్యిమైళ్ల వెనక వుండింది. మరోగంటకల్లా మరి వెయ్యిమైళ్లు ముందుకు వెడుతుంది. ఈ భూమికి సుస్థిరతలేదు. భూమిమీద నిలుచున్న మనిషి ఈ వాస్తవాన్నిగూర్చి ఆలోచించటానికి ఇష్టపడటంలేదు. ఈ భూమికి స్థిరత్వం వుందనుకుంటున్నాడతను. తన యిల్లూ, తన కొట్టు, తన పొలం కదలటంలేదుకదా? ఎక్కడున్న యిల్లు అక్కడే వుంది! ఎక్కడున్న పొలం అక్కడే వుంది! ఇవన్నీ తనవి! ఎక్కడున్న గొంగళి అక్కడే వుంది! అది నాది!

నా దేశ విస్తీర్ణతనుగూర్చి నే నొకప్పుడు గర్వించాను. నేను భారతీయుణ్ణి! నాదనుకుంటున్న ఈ దేశంలో నా కొక్కసెంటుభూమికూడాలేదు. పరుల నేలమీద నడుస్తున్నాను. పరుల నీడలో తలదాచుకుంటున్నాను. నేను భారతీయుణ్ణయితే ఎవరికావాలి? డబ్బిచ్చి కొనగలవాడిదే ఈ గ్లోబు!

దేవుడనేవాడు నా కిచ్చినవి మూడు. ఈ

భూమిమీద శ్వాసించటానికి ఒక ప్రాణం, చచ్చేదాక ఆ ప్రాణాన్ని నిలుపుకొనటానికి ఒక ఉద్యోగం, పవిత్ర భారతదేశంలో పుట్టి, గిట్టే ఒక వరం!

అడ్డుదారులు త్రొక్కటానికి ఏమాత్రం అవకాశంలేని పవిత్రమైన, గౌరవరహితమైనవృత్తి నాది. దానిద్వారా నాకు వచ్చే జీతంలో ఏం మిగులుతుంది? ఆ జీతం డబ్బుల్ని కనీసావసరాలు మూడింటికి మాత్రమే వినియోగిస్తాను. తిండి కొంటాను. గుడ్డ కొంటాను. నిలువనీడకు అద్దె చెల్లిస్తాను. 'సదానంద, నీ పదాంబుజమ్ముల మదిన్నమ్మి యున్నానురా'అంటూ నా కాళ్లవద్ద పడివున్న నా ప్రియబాంధవి, కన్నవాళ్లకు జాలిగొలిపే నా ముద్దుబిడ్డలు ముగ్గురు, పగలల్లా దేవుణ్ణి ఆడిపోసుకుంటూ, రాత్రిపూట ముక్కోటి దేవుళ్లను పేరుపేరునా స్మరిస్తూ, నిదురలో తీయని కలలుగంటూ బ్రతికే నేను— ఐదుగురం బ్రతకాలి! కలలు ఫలించే రోజుకోసం బ్రతకాలి! బ్రతకటానికి డబ్బు చెల్లించాలి!

నలకూబరుడి చేలాన్ని ఎగరేసుకుపోయిన పావురాలకు మల్లే—నా జీతం డబ్బుల్ని చిటికెలో మటుమాయంచేసే వింత పావురాలు—అవిగో, అల్లవిగో—ఆకాశపు లోతుల్లో మసకమబ్బులా కనబడుతున్నాయి చూడండి. వాటి పేరు ధరలు!

'ధరలు తగ్గాలి', 'దారిద్ర్యం తొలగాలి!'—ఇవికూడా మనవారి నినాదాలే! మంత్రాలతో మామిడికాయలు రాల్చేద్దాం! గోనెసంచులు పట్టండి!

పెరిగితే పెరిగాయిగానీ, పరమఛాందసుడని నేను అపోహపడ్డ మహాకవిచేత అభ్యుదయకరమైన మాటను పలికించాయి ధరలు. 'ఈ దయగల సర్కారువారు నాకు యిలా బిరుదాలు, బహుమతులు యివ్వకపోతే—మిరపకాయల ధరలు కాస్త తగ్గించి పుణ్యం కట్టుకోరాదూ?' అని వాపోయా రాయన. గుంటూరు మిరపకాయలాంటి మాట! ఓ కవీ, మిరపకాయలో కారం వున్నంతదాక నీ కీర్తి నిలిచియుండుగాక!

ఈ ధరలు ఎందుకు తగ్గవు? నా తల్లి గొడ్డుటావుకాదే? ఈ ధాన్యాగారం వట్టిపోలేదే!' 'విరగపండిన జొన్నచేనిలా తయారైన జనాభాకు సరిపడ్డంత గింజలు దేశంలో లేవయ్యా, కనుక వున్న గింజల్ని వేలంపాటకు పెట్టాం' అని అంటే ఒప్పుకోవలసిందే! అయితే కిరాణాకొట్టువాడు 'సరుకంతా అమ్మేశాం బాబూ, ఇక మీరు వెళ్ళండి!' అనాలిగదా? అంటున్నాడా? సూర్యుడు ఉదయించడం ఏనాడైనా మానుకున్నాడా? ఏభై కోట్ల మందీ కొంటూనే వున్నారు, తింటూనే వున్నారు. మనిషికీ మనిషికీ మధ్య అంతరాలు పెరిగిపోతూనే వున్నాయి. పదిమంది అప్పులపాలై పోతున్నారు. ఆ పదిమంది దారిద్ర్యం పదకొండోవాడి పాలిటికి పాడియావై బువ్వ పెడుతున్నది. రెక్కలకష్టంతో గంజిత్రాగి బ్రతుకుతున్న వాడొకడైతే, వాడిచ్చే వడ్డీలతో పరమాన్నం కుడుస్తున్న వాడొకడైనాడు. పదిమంది క్షేమంకోసం ధరలు నేలకు దిగివస్తే, పాపం ఆ పదకొండోవాడి బ్రతుకేం కావాలి? ధరలు దేవతల్లాంటివి. అవి నేల మీదికి దిగిరావు!

పొదుపు ఉద్యమశాఖవారు నన్ను పొదుపు చెయ్యమంటుంటే నేనేం చేశాను? అప్పులు చేశాను! ఆడంబరంకోసం చేసిన అప్పులు కావు అవి. నా అవసర నిమిత్తమై నా కుటుంబ ఖర్చులకుగాను అప్పుచేశాను. ఇందుకుగాను నూటికి నెల ఒకటింటికి కొంత వడ్డీచొప్పున ప్రతినెలా చెల్లిస్తూ, పరిస్థితులు అనుకూలించినవెంటనే ఋణవిముక్తుడను కాగలను. అంతవరకూ నా తల—ఇది మేధావంతుడి తల—నీవద్ద తాకట్టు పెట్టుకో!

పరిస్థితులు అనుకూలించేదెప్పుడు? మెడలో మాంగల్యంకట్టి, నిద్రపోయే కోరికల్ని మేల్కొల్పి ఆదరాబాదరాగా యుద్ధరంగానికి వెళ్లిపోయిన మొగుడికోసం కళ్లు కాయలు గాచేలా ఎదురుచూచే కొత్త పెళ్లికూతురికి మల్లే ఎంతకాలం ఈ నిరీక్షణ? నన్ను కవ్వించి వెళ్లిపోయిన నావాడు వున్నాడో, చచ్చాడో? వస్తాడో, రాడో? వాడొచ్చేలోపల ఏ ఇంద్రు

డొచ్చి నన్ను చెరిచిపోతాడో? ఏ మాయలమరాటీవచ్చి నన్నెత్తుకుపోతాడో?

గుండెకుండలో ముగ్గబెట్టిన నా ఆశ పండేదెప్పుడు? లాటరీ కట్టమంటారా? లక్ష రూపాయ లొస్తుందంటారా? నాకు రాదు! ఇది సత్యం! ఒక్కడికొస్తే రావచ్చు అందరికీ రాదు. సత్యాన్ని ఆ ఒక్కడిపరం చెయ్యమంటారా? వదు. అందరిపక్షానవున్న సత్యాన్నే చెప్పుకుందాం! నాకు లాటరీలో బహుమతిరాదు! అలాంటి గొంతెమ్మకోరికలు నాకు లేవు.

పిల్లనిచ్చిన మామగారిమీద అలుకబూనమంటారా? పాపం, అత్తమామలు ఆయనకు లేరు!

నాకు అప్పులిచ్చినవాళ్లు నన్ను వేధిస్తారు. నా అప్పు తీర్చవలసినవాళ్లూ నన్ను వేధిస్తారు. నేను అప్పు తీర్చవలసివస్తే అసలు, వడ్డీ—మొత్తం చెల్లించాలి. నా అప్పు తీర్చవలసినవాళ్లు నాకు వడ్డీ యివ్వరు. వడ్డీలు కట్టవలసిరావడం ఎంత దయనీయమో, వడ్డీలిమ్మని అడగడం అంత హేయం! పవిత్రమైన దారిద్ర్యంలో తలమునక లవడానికే యిష్టపడతానుగానీ, హేయమైనబతుకును నేను కోరను. కూడుపెట్టి కాపాడే ప్రభుత్వం నా కివ్వవలసిన అసలుమాత్రం యిచ్చి, అవసరంలో ఆదుకుంటే అదే పదివేలు! నా ఇంక్రిమెంటల్ అరియర్సు, అలాంటి మరికొన్ని బకాయిలు నన్ను తమ ఒడిలోకి తీసుకుని ఓదార్చే శుభవేళ ఎప్పుడొస్తుంది? ఈ ఏడా? పై ఏడా? మరొక ఐదేళ్లకా?

తాకట్టులోవున్న నా తలకాయను విడిపించుకునేదెప్పుడు? ఆరుబయట స్వేచ్ఛగా నిలబడి, హాయిగా ఊపిరి పీల్చుకునే దెప్పుడు? ఇటువంటి స్వాతంత్ర్య దినోత్సవాన్ని కొండంతఉత్సాహంతో జరుపుకునే ఆ మహాపర్వదినం ఎప్పుడు? ఈ ప్రశ్న ఎవరి నడగాలి? సుదర్శనచక్రంలాంటి ఎన్నికలు తరుముకొచ్చినప్పుడు నా గుమ్మం వెతుక్కుంటూవచ్చి నా వోటుకోసం కాళ్లావేళ్లాపడే ఈ వ్యవస్థ నడగనా? ఈ వ్యవస్థకు గొడుగుపడుతున్న జెండా నడగనా?

ఇంతదూరం నడిచి ఎక్కడికొచ్చానేను? ఇప్పుడెక్కడున్నాను? ఇక్కడే! ఈ జెండా క్రిందే! తల పైకెత్తాను. ప్రాణాధికమైన నా జెండా-నా మానాభిమానాలతో సమానమైన జాతీయజెండా—రెపరెపలాడటంలేదు. వాడిపోయిన పువ్వులా, నవ్వలేని నా గుండెకాయలా ముడుచుకుంది. ఎందుకు? ఏమైంది? నిన్నెవరేమన్నారమ్మా?

కన్నతల్లిలాంటి నా జెండా—తన పాదాలవద్దనుంచున్న నన్నుచూసి, నిస్పృహాయంగా నిట్టూరుస్తోందా?

'అప్పిచ్చిన ఏ అమెరికావాడో, రష్యావాడో, మరొకడో దిగంతాలలో నిలబడివున్నాడేమో, వాడి కంటిపాపలో తన బొమ్మ పడుతుందేమోనన్న గుబులుతో గగనవీధిలో స్వేచ్ఛగా ఎగరలేకపోతోంది నా 'జెండా'అంటూ అతిశయోక్తులు చెప్పడం నా కిష్టం లేదు, చెప్పను. ఉన్నమాటే చెబుతాను.

జెండా వూరుకోవడానికి కారణం — గాలి కదలటంలేదు.

ఉప్పుమూటమోసే గాడిదలా నా గుండె యిలా మూలిగింది: 'ఎగురవే ఎగురవే ఎగురవే జెండా!'